జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 25-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 655 పేజీలు: 4 వెల : రూ.7

## లేఅవుట్ల అక్రమాలు..
# పంచాయతీ కార్యదర్శిపై వేటు




* తోటపాలెంలో కోట్లు కొల్లగొట్టిన ఘనుడు
* 5 శాతం పెన్షన్ కోత విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
* ఎచ్చెర్ల మండలంలో రూ.6.67 కోట్ల ఆదాయానికి గండి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 24 (వార్త):** ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం, ఎచ్చెర్ల గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన అనధికారిక లేఅవుట్ల అనుమతుల వ్యవహారంలో ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. అప్పట్లో తోటపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి రిటైర్ అయిన ఎం.సూర్యనారాయణపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయన పొందే పెన్షన్‌లో శాశ్వతంగా 5 శాతం కోత విధిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు ( జీవో. 323) జారీ చేశారు. విజిలెన్స్ విభాగం 2015లో జరిపిన విచారణ ప్రకారం.. ఉడా, డీటీసీపీ పరిధిలో ఉన్న భూములకు పంచాయతీ కార్యదర్శి తన పరిధికి మించి అక్రమంగా లేఅవుట్ ప్లాన్లకు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్లలో కేటాయించాల్సిన 10 శాతం బహిరంగ ప్రదేశాన్ని పంచాయతీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడంలోనూ, సెక్యూరిటీ డిపాజిట్లు, లేఅవుట్ ఫీజుల వసూలులోనూ తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీనివల్ల గ్రామ పంచాయతీలకు రూ. 6,67,54,828 మేర ఆదాయ నష్టం వాటిల్లిందని విచారణలో తేలింది.

### చిరునామా దొరక్క గెజిట్‌లో నోటీసులు

ఈ వ్యవహారంపై 2016 నుంచే క్రమశిక్షణ చర్యలు ప్రారంభమయ్యాయి. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో జరిగిన విచారణలో సూర్యనారాయణపై మోపిన అభియోగాలు నిజమేనని తేలింది. అయితే, ఆయన చిరునామా లభ్యం కాకపోవడంతో షోకాజ్ నోటీసులను ప్రభుత్వం గెజిట్ ద్వారా ప్రకటించాల్సి వచ్చింది. గడువులోగా ఎలాంటి వివరణ ఇవ్వకపోవడంతో, ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్-1980 ప్రకారం ఈ జరిమానా విధిస్తూ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది.

## కాలుష్య కోరల్లో..
# కొత్తూరు!

* చెత్తతో పూడుకుపోయిన అడ్డుబంగి గెడ్డ * 1500 ఎకరాల సాగుభూమికి 'విషం' * పాలకుల నిర్లక్ష్యానికి పచ్చని పొలాలు బలి * పన్నుల వసూలుపై ఉన్న శ్రద్ధ.. శుభ్రతపై ఏది? * రోగాలు వస్తేనే అధికారులు స్పందిస్తారా? * కుళ్లిన వ్యర్థాలతో ఊపిరాడని కొత్తూరు పురవీధులు * డబ్బులు రావు కనుకనే ఈ గెడ్డను గాలికొదిలేశారా..?



**కొత్తూరు, ఏప్రిల్ 24 (వార్త):** కొత్తూరు మండల ప్రజలారా మేల్కొనండి.. మన కళ్ల ముందే మన ఊపిరి ఆగిపోతోంది. ఒకప్పుడు వేల ఎకరాలకు ప్రాణాధారమై, పచ్చని పంటలతో కళకళలాడిన కొత్తూరు - అడ్డుబంగి గెడ్డ నేడు మురికి కూపంగా మారింది. సుమారు 1500 ఎకరాల పంట భూములకు ఆధారమైన ఈ నీటి వనరు.. నేడు విషతుల్యమైన వ్యర్థాలతో నిండిపోయి కుళ్లిపోతున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. గ్రామంలోని ఈ గెడ్డకు ఆనుకుని ఉన్న గృహాలు, హోటళ్లు, కూరగాయల మార్కెట్లు, చేపలు షాపు, వివిధ వ్యాపార యజమానులు తమ స్వార్థం కోసం వ్యర్థాలన్నింటినీ నేరుగా ఈ గెడ్డలోకి కుమ్మరిస్తుండటంతో, పవిత్రమైన జలవనరు కాస్తా మురుగు కాలువగా మారింది. కాలుష్య నీటి ప్రవాహం కొత్తూరు పురవీధుల్లో దర్శనమిస్తుంటే అధికారులు ఏమీ ఎరగనట్టు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సమస్యపై ఇదివరకే అనేక పత్రికలలో వార్తలు ప్రచురించిన, నాయకులకు, అధికారులకు ఎంత వేడుకున్నా పట్టించుకునే ఒక మంచి మనసున్న నాయకులు కరువయ్యారు. గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేయడంలో చూపే ఉత్సాహం, ప్రజల ఆరోగ్యానికి భరోసానిచ్చే పారిశుధ్య నిర్వహణలో ఎందుకు కనిపించడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. ఇంటి ముందు శుభ్రత లేని పన్నులు ఎవరి కోసం అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజల్లో చైతన్యం శూన్యం కావడం వల్లే నాయకులకు, అధికారులకు ఇంతలా బరితెగింపు పెరిగిపోయిందని, వారి నిర్లక్ష్యం వల్ల సామాన్యుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డయేరియా వంటి మహమ్మారులు ప్రబలినప్పుడు మాత్రమే ప్రత్యక్షమయ్యే అధికార యంత్రాంగం, ముందుగానే ఈ దుర్వాసన కొడుతున్న కాలువలను బాగు చేయవచ్చని కనీస జ్ఞానం లేకపోవడం గమనార్హం. బహుశా ఈ కాలువను బాగు చేస్తే పర్సంటేజీల రూపంలో డబ్బులు రావు కనుకనే, ఈ గెడ్డను ఇలా గాలికొదిలేశారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇప్పుడైనా ప్రజలు చైతన్యవంతులై ఈ అన్యాయాన్ని ప్రశ్నించకపోతే, రేపు మనం తాగే నీరు, తినే ఆహారం మొత్తం విషతుల్యం కాక తప్పదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అడ్డుబంగి గెడ్డను ప్రక్షాళన చేయకపోతే ప్రజాగ్రహం తప్పదని సామాజిక కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.



## వంతెన వద్దకు.. శ్యాం ప్రసాద్.. కలెక్టర్ వద్దకు.. రామారావు!

* బహుద వంతెన సమస్యపై తలోదారిలో నేతలు
* ఇచ్ఛాపురం వైసీపీలో సర్వత్ర గుసగుసలు



**సోంపేట, ఏప్రిల్ 24 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి గాడిలో పడుతుందన్న సమయంలో నేతలు తీరు మాత్రం ఇంకా మారలేదని తెలుస్తోంది. ఒకే సమస్యపై ఒకే రోజున నేతలు వేరువేరు చోట్ల ఎవరి రీతిలో వారు సమస్యపై స్పందించడం పార్టీ శ్రేణులకు అయోమయానికి గురిచేస్తుంది. ఇటువంటి చవకబారు చర్యల వల్ల అధికార పక్షం వద్ద ప్రతిపక్షం మరింత బలహీన పడే పరిస్థితి తప్ప మెరుగుపడే పరిస్థితి లేదన్న విషయం తేటతెల్లమవుతుంది. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం పట్టణం సమీపంలో బహుద నదిపై వంతెన కూలి రెండేళ్లకు పైగా గడుస్తుంది. అప్పటి ప్రభుత్వం ఈ నిర్మాణానికి 20 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. కానీ ఆ నిర్మాణం ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రభుత్వ తీరుపై నిరసిస్తూ ఇచ్ఛాపురం వైకాపా కన్వీనర్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నేత నర్తు నరేంద్ర యాదవ్, ఇచ్ఛాపురం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు, పలువురు వైసీపీ నేతలు కలిసి బహుద నదిలోనే నిరసన తెలియజేస్తూ ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తి పోశారు. అదే సందర్భంలో నియోజకవర్గ నేత ఎమ్మెల్సీ నర్తు రామారావు మాత్రం నియోజకవర్గంలో కార్యక్రమాన్ని పక్కనపెట్టి నేరుగా జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి ఆయన ఒక్కరే ఈ సమస్యపై వినతి పత్రం అందజేశారు. ఇలా ఒకే కార్యక్రమంపై ఒకే రోజున నేతలు ఎవరికి నచ్చిన రీతిలో వారు వ్యవహారాలు చేయడం పార్టీ శ్రేణులకు అయోమయానికి గురి చేస్తుందని పలువురు కార్యకర్తలు వాపోతున్నారు. ఐక్యంగా పనిచేసి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసీపీని మరింత పటిష్టం చేసి రాబోవు ఎన్నికల్లో విజయ సాధన దిశగా అందరూ ఐక్యంగా కృషి చేయాల్సిన నేతలు ఇలా వ్యవహరించడం పట్ల కార్యకర్తలు విస్తుపోతున్నారు. వైసీపీలో ఇంకా గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయని చెప్పడానికి ఇది నిదర్శనం కాదా అంటూ టిడిపిలో కొంతమంది బాహాటంగా పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలపై పోరాడి పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు కృషి చేయాలి తప్ప వినతి పత్రాలతో కాదని ఆ పార్టీ కార్యకర్తలే పేర్కొంటున్నారు. అనాదిగా వస్తున్న కాంగ్రెస్ పార్టీ సంస్కృతి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇప్పటికీ కొనసాగుతుందని ఇది మారడానికి ఇంకెంతకాలం పడుతుందోనంటూ కార్యకర్తలు వాపోతున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# స్వీయ గృహ గణన చేసుకోవాలి

**- తహశీల్దార్ విజయలక్ష్మి**

**సారవకోట, ఏప్రిల్ 24 (వార్త):** ప్రజలు స్వీయ గృహ గణన చేసుకోవాలని తహశీల్దార్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. మండలంలోని 35 పంచాయతీలలో గృహ గణన నిర్వహణకు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మూడు విడతలలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వారు వచ్చే నెల 1వ తేదీ నుంచి గ్రామాల్లో గృహ గణన ప్రక్రియను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఈలోపు ప్రజలు ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

నమోదు పూర్తయ్యిన తర్వాత ఒక ప్రత్యేక నంబర్ లభిస్తుందని, ఆ నంబర్‌ను ఎన్యుమరేటర్‌కు అందజేయాలని సూచించారు. గృహ గణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సహకరించాలని తహశీల్దార్ కోరారు.



## పర్లాం-మాకివలసలో అభివృద్ధి పనుల ప్రారంభం

**-రూ.23 లక్షలతో సిమెంట్ రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణం**



**జలుమూరు, ఏప్రిల్ 24 (వార్త):** పర్లాం-మాకివలస గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.23 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ పనులను నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ఈ అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడటానికి ఇవి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పంచాయతీరాజ్ శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మబగాంలో ప్రజాదర్బార్

**- సమస్యలు విన్న ఎమ్మెల్యే**

**- అర్హులకు త్వరితగతిన సహాయం అందిస్తామని హామీ**



**పోలాకి, ఏప్రిల్ 24 (వార్త):** మబగాం గ్రామంలోని స్వగృహంలో నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిన ఎమ్మెల్యే, అర్హులైన వారికి త్వరితగతిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, రహదారులు, మౌలిక వసతులపై వచ్చిన వినతిపత్రాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారం కోసం చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఇలాంటి ప్రజాదర్బార్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తీసుకుంటున్న చర్యలను గ్రామ ప్రజలు అభినందిస్తూ తమ సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మానవ సేవయే మాధవ సేవ!




**కవిటి, ఏప్రిల్ 24 (వార్త):** మానవసేవయే మాధవ సేవ అన్న శ్రీ సత్య సాయి బాబా ఆలోచనకు అనుగుణంగా కవిటి మండలం రాజపురం గ్రామానికి చెందిన శ్రీ సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రతినెల నిరుపేదలకు అందించే కిరాణా సామాగ్రి కిట్లను ఈనెల శుక్రవారం మూడు నిరుపేద కుటుంబాలకు సభ్యులు అందజేశారు. ఎర్ర గోవింద పుట్టుక గ్రామానికి చెందిన ఎర్ర హరావతి, కవిటి చింతామణి కాలనీకి చెందిన మూలి లక్ష్మమ్మ, కవిటి గ్రామానికి చెందిన నేలా బెహరాలకు అందజేశారు. ఆయా కుటుంబీకులు సత్యసాయి భక్తులను అభినందించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించండి

**సారవకోట ఎంపీపీకి వినతి అందజేసిన జనసేన నేత**

**సారవకోట, ఏప్రిల్ 24 (వార్త):** సారవకోట మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని జనసేన నాయకుడు పృథ్వీ ఎంపీపీ కూర్మినాయుడును కోరారు. శుక్రవారం ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తూ, మండల కేంద్రమైనప్పటికీ రక్షిత మంచి నీటి పథకం నుంచి సరైన నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వేసవిలో సమస్య మరింత తీవ్రమవుతోందని పేర్కొన్నారు. తాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే చర్యలు తీసుకుని నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# అసౌకర్యాల నడుమ నెహ్రూ పార్క్

**- అసాంఘిక కార్యక్రమాలకు**

**అడ్డాగా మారుతున్న వైనం**

**- వాకర్స్ క్లబ్ గుండెల్లో ఆవేదన**



**పలాస, ఏప్రిల్ 24 (వార్త):** పలాసలోని నెహ్రూ పార్క్... పేరు చెప్పగానే ఆహ్లాదం, విశ్రాంతి గుర్తొస్తాయి. కానీ వాస్తవానికి అక్కడికి వెళ్లే ప్రజలను మాత్రం తీవ్ర అసౌకర్యాలు వేధిస్తున్నాయి. వేసవి వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పార్క్‌కు తరలివస్తున్న వందలాది మంది పట్టణవాసులకు కనీస సదుపాయాలే అందుబాటులో లేకపోవడం వారి ఆగ్రహానికి దారి తీస్తోంది. ముఖ్యంగా టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవస్థలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. పార్క్‌లోని పిల్లల ఆట వస్తువులు పాడైపోవడంతో చిన్నారులకు ఆడుకునే అవకాశాలు లేకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక చెరువులో నీరు అడుగంటిపోవడంతో పార్క్ అందం మసకబారుతోందని స్థానికులు స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. చెరువును శుభ్రపరచి నీరు నింపాలని, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం వాకర్స్, సాయంత్రం వేళల్లో జంటలు, కుటుంబాలు పెద్ద ఎత్తున తరలివస్తున్నప్పటికీ, కనీస వసతుల లేమి పార్క్ ప్రతిష్టను దిగజారుస్తోంది. గడ్డి పెంచి, మొక్కలు నాటి, పార్క్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది జంటలు పార్కు చేరుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అంశంపై వివరణ కోరగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు స్పందిస్తూ నెహ్రూ పార్క్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదక వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## వంశధార డిగ్రీ కళాశాలలో శక్తి

**విద్యార్థులకు స్వీయ రక్షణ, రోడ్డు భద్రతపై మార్గదర్శనం**



**జలుమూరు, ఏప్రిల్ 24 (వార్త):** టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో చల్లవానిపేట గ్రామంలోని వంశధార డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల బాలికలకు స్వీయ రక్షణపై అవగాహన కల్పిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ల వినియోగం గురించి వివరించారు. నేషనల్ హైవే, గ్రామీణ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే నేషనల్ హైవే హెల్ప్ లైన్ 1033, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు 112, 181, 1091 వినియోగంపై వివరించారు. గృహహింస, వేధింపులు, గ్రాజూరా కేసులు, సైబర్ మోసాలపై 1930, యాంటీ డ్రగ్స్ కోసం 1972, బాలల సమస్యల కోసం 1098 నెంబర్ల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి శక్తి టీం సభ్యులు ఎం. గిరిధర్, డి. శ్రీనివాస్ రావు, కె. చామంతి, కళాశాల ప్రిన్సిపాల్ వి.శాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం శక్తి టీం సభ్యులు మొక్కలు నాటి, విద్యార్థులకు గడియారాలను అందజేశారు.

## కూటమి సర్కార్‌లో ..

# అభివృద్ధికి పెద్దపీట

**- ఎమ్మెల్యే డాక్టర్ అశోక్**

**కంచిలి, ఏప్రిల్ 24 (వార్త):** గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బంధాలు అశోక్ పేర్కొన్నారు. బూరగాం పంచాయతీలో జనసేన ఇన్చార్జ్ దాసరి రాజుతో కలిసి శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మూడున్నర లక్షల నిధులతో నిర్మించిన కళావేదిక, 67 లక్షల రూపాయల నాబార్డ్ నిధులతో నిర్మించిన బూరగం సోంపేట తారు రోడ్డు నిర్మాణం, 30 లక్షల రూపాయల పల్లి పండుగ నిధులతో నిర్మించిన గొల్ల వీధి సిమెంట్ రోడ్డు నిర్మాణం, 12 లక్షలు జిరాంజి నిధులతో నిర్మించిన బాలా లింగేశ్వర ఆలయం సిమెంట్ రోడ్ నిర్మాణం, మూడు లక్షల రూపాయలతో నిర్మించిన కప్ప వీధి సిమెంట్ రోడ్ నిర్మాణాలను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఇటువంటి గొప్ప అభివృద్ధి పనులను ఈరోజు ప్రారంభోత్సవం చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ప్రతి ఒక్కరు స్వాగతించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొడ్డు రాజేశ్వరి అప్పారావు, జగదీష్ పట్నాయక్, మాదిన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



## అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనం

**- సంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు**

**-పర్యవేక్షించిన కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు**



**నరసన్నపేట, ఏప్రిల్ 24 (వార్త):** పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లో భోజన వసతులపై పర్యవేక్షణ నిర్వహించగా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు తెలిపారు. అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న పేదలు, కార్మికులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందుతున్నందుకు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని దీవించడం ఆనందాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. పేదలకు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని, ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణబాబు, రావాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

## మారుతినగర్ జంక్షన్‌లో ..


# బోరు తొలగింపుపై వివాదం

**- ప్రజలకు తాగునీటి ఇబ్బందులు**

**-చర్యలు తీసుకోవాలన్న డిమాండ్**



**నరసన్నపేట, ఏప్రిల్ 24 (వార్త):** మారుతి నగర్ జంక్షన్ వద్ద గతంలో ఉన్న గ్రామపంచాయతీ చేతిపంపు బోరు తొలగింపుపై వివాదం నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం, గత సంవత్సరం ఈ బోరును తొలగించి ఆ ప్రదేశాన్ని ఒక ప్రైవేటు హోటల్ పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. బోరు తొలగించిన వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ ఈవోను ప్రశ్నించగా, గతంలో అక్కడ బోరు ఉన్న విషయం తనకు తెలియదని సమాధానం ఇచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మారుతి నగర్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు తాగునీటి కోసం ఈ బోరుపై ఆధారపడేవారని, ప్రస్తుతం అది లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ ఘటనపై జిల్లా స్థాయి అధికారులు, డీపీఓ, జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపి, బోరును తిరిగి ఏర్పాటు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


ఎండార్స్ మెంట్

శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలం, కరగాం గ్రామ పంచాయితీ పరిధిలో గల శ్రీ యల్లా మల్లేశ్వరరావు, తండ్రి నరసింహులు వారు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS) నందు ఫిర్యాదు నెం. (SKL20260409l129, DT.09-04-2026) ద్వారా ఫిర్యాదు చేసియున్నారు. నేను కార్యనిర్వాహణాధికారిగా జాయినింగ్ తే.28-08-2024ది నుండి ఆహా హోటల్ పార్కింగ్ స్థలములో ఎటువంటి పబ్లిక్ బోరు ఉండలేదు. గత కార్యనిర్వాహణాధికారి పని చేయు కాలములో పబ్లిక్ బోరు ఉన్నట్లు గాని తొలగించినట్లు గాని ఈ గ్రామ పంచాయితీ నందు సదరు పబ్లిక్ బోరుకి సంబంధించి ఎటువంటి రికార్డులు లభ్యములో లేదు. సదరు స్థలములో క్రొత్తగా పబ్లిక్ బోరు నిర్మాణం చేయుటకు ప్రత్యేకాధికారి వారి అనుమతి ఉత్తర్వులు జారీచేయవలసియున్నది. సమస్య పరిష్కరించబడినదని తమకు తెలియజేయడమైనది.

T Dayakar 21/4/26
కార్యనిర్వహణాధికారి
పంచాయితీ కార్యదర్శి
గ్రామ పంచాయితీ

వారికి:-
శ్రీ యల్లా మల్లేశ్వరరావు

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# గ్రామ కమిటీల వెరిఫికేషన్ వేగవంతం

**- పార్టీ బలోపేతంపై కృష్ణదాస్ దిశానిర్దేశం**

**నరసన్నపేట, ఏప్రిల్ 24 (వార్త):** పార్టీ గ్రామ కమిటీల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కార్యకర్తలందరికీ ఐడీ కార్డులు అందజేయడం, గ్రామ స్థాయి కమిటీలను సక్రమంగా ధృవీకరించడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు డిజిటల్ ప్రక్రియను పూర్తి చేసి పార్టీ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు.




# పలాస జిల్లాపై ప్రభుత్వానికి అభ్యంతరమెందుకో?

**-మాటలకే వికేంద్రీకరణ పరిమితమా**
**-పరిపాలన కేంద్రీకరణతో మరిన్ని ఆర్థిక అసమానతలు.. ప్రాంతీయ విభేదాలు**
**-పలాస మాజీ జడ్పీటీసీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది వరిశ హరిప్రసాద్**

**పలాస, ఏప్రిల్ 24 (వార్త):** కొన్ని శతాబ్దాల క్రితం ఒడిస్సా రాష్ట్ర పాలకుల పరిపాలన కాదనుకొని, తెలుగుజాతి స్థిరత కోసం దక్షిణాది రాష్ట్రమైన మద్రాస్ ప్రాన్సిస్ ( ప్రెసిడెన్సి) వైపు ప్రయాణం చేసి, తరువాత ఆంధ్ర రాష్ట్ర సాధన, సమైక్యాంధ్ర, విభజన ఆంధ్ర ప్రదేశ్ వరకు ప్రస్థానం కొనసాగినప్పటికీ, స్వాతంత్ర్య ఫలాలకు నోచుకోని ప్రాంతం ఏదైనా ఉందంటే.. అది ఉద్దానం మాత్రమేనని ప్రముఖ న్యాయవాది, పలాస మాజీ జడ్పీటీసీ సభ్యుడు వరిశ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం పలాసలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుంచి అనేక రంగాల్లో వెనుకబడి పోవడమే కాకుండా, అభివృద్ధిపై కూడా ఇతర ప్రాంతాల కంటే ఉద్దానంపై పాలకుల వివక్షత, నిర్లక్ష్యం కనబరచడం వల్ల ఈ ప్రాంతం వలసల అడ్డాగా ముద్ర పడిందని, మిగతా నాగరికత సమాజంతో పాటు, స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడటానికి పలాసను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడం అనేది ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమని స్పష్టం చేశారు. ఇది కేవలం పరిపాలన సౌలభ్యం కోసం మాత్రమే కాకుండా, ఈ ప్రాంతం ప్రత్యేక పరిస్థితులతో చారిత్రక, ఆర్థిక, భౌగోళిక అవసరంగా పాలకులు పలాస జిల్లా ఆవశ్యకతను గుర్తించాలని ఆయన కోరారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి వంటి నియోజకవర్గాల ప్రజలు ప్రస్తుతం జిల్లా కేంద్రమైన శ్రీకాకుళానికి వెళ్లాలంటే సుమారు 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఇది ప్రజలపై వ్యయ ప్రయాసల భారాన్ని పెంచుతుందన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన నియోజక వర్గాల జాబితాలో అట్టడుగున ఉన్న నియోజకవర్గాలలో ఇచ్ఛాపురం ఒకటని, ఇక్కడ సహజ వనరులు ఉన్నప్పటికీ, సాగునీరుతో పాటు తాగునీరు కొరత చాలా తీవ్రంగా ఉందని, వ్యవసాయ రంగం కూడా సంక్షోభంలో ఉందన్నారు. ప్రధానంగా ఉద్దానం అంటే జీడి, కొబ్బరి, పనస, మునగ పంటలతో పాటు మరికొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందినప్పటికీ, సాగునీటి వనరుల కొరతతో రైతాంగం వ్యవసాయ రంగం నుంచి వైదొలగాల్సిన పరిస్థితి దాపురించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే వంశధార జలాలు ఇచ్ఛాపురం వరకు, మహేంద్ర తనయ మిగులు జలాలు సద్వినియోగం పరుచుకుంటే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. రాష్ట్రంలోనే అత్యల్ప తలసరి ఆదాయం కలిగిన ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పాటు ఉద్దానంలో అనేక గ్రామ పంచాయతీలు కూడా ఉన్నాయని, పారిశ్రామిక రంగంలో కూడా చాలా వెనుకబడి ఉందన్నారు. విద్య, వైద్య, ఆర్థిక, ఉద్యోగ, పారిశ్రామిక, సామాజిక రంగాలలో కూడా వెనుకబాటుతనంతోపాటు జరుగుబాటు తనానికి నోచుకోని ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే.. పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక జిల్లాలు పునర్విభజన చేస్తూ, పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామంటూ.. ఈ ప్రాంత ప్రజలలో ఆశలు రేకెత్తించి.. చివరి నిమిషంలో జిల్లా ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం మొండి చెయ్యి చూపిన తీరుపై స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. రాజకీయాలను పక్కకు పెట్టి ఈ ప్రాంత చిరకాల వాంఛైన పలాస జిల్లా



కేంద్రం ఏర్పాటు విషయంలో ప్రజాభీష్టం మేర ప్రభుత్వంపై ఒత్తిడి చేయవలసిన బాధ్యత ఈ ప్రాంత ప్రజా ప్రతినిధుల దేనని హరిప్రసాద్ స్పష్టం చేశారు. పలాస జిల్లా సాధన పోరాట ఉద్యమానికి తాను సంపూర్ణ మద్దతు రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నానని, అందు కోసం ఎందాకైనా వెళ్తామని హరిప్రసాద్ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు.

### ఉపాధి వేతనదారులకు

# ప్రభుత్వ బడులపై అవగాహన

**- దూకులపాడులో ఎంఈఓ దాలినాయుడు సందేశం**

**నరసన్నపేట, ఏప్రిల్ 24(వార్త):** దూకులపాడులో ఉపాధి హామీ వేతనదారులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై ఎంఈఓ పేడాడ దాలినాయుడు అవగాహన కల్పించారు. శుక్రవారం ఉదయం గ్రామానికి చేరుకున్న ఆయన చెరువు వద్ద పనిచేస్తున్న వేతనదారులతో మాట్లాడారు. కూలి చేసుకుంటూ జీవిస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉచితంగా అందుతున్నాయని వివరించారు. తల్లిదండ్రులు ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకుని తమ పిల్లల భవిష్యత్తును మెరుగుపరచాలని సూచించారు.



### సంస్థాగత నిర్మాణంతో ..

# వైసీపీని పటిష్టం చేద్దాం



**కంచిలి, ఏప్రిల్ 24 (వార్త):** గ్రామస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంతో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు అందరం సమన్వయంతో కృషి చేద్దామని వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. మఠం సరియాపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పలు విషయాలను మాట్లాడారు. గ్రామస్థాయిలో నియమించిన పార్టీ కమిటీలను వారి బాధ్యతలను గుర్తు చేశారు. పార్టీకి సంబంధించిన వాస్తవ ఓటర్లను పరిరక్షించుకోవడానికి తీసుకోవలసిన చర్యలు వివరించారు. వైయస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రిగా ప్రతిష్ఠించడమే మన అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్తు నరేంద్ర, ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొనపల సురేష్, సాలిన గాంధీ ఘనప సింహాచలం బుడ్డెపు విశ్వనాథ్ బుడ్డపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసత్యసాయి విద్యావిహార్‌కు ..

# ఇన్నోవేషన్ బిజీ హబ్ అవార్డు

**పలాస, ఏప్రిల్ 24 (వార్త):** బిజీ హబ్ క్రియేషన్స్ రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాల నుంచి 400 స్కూల్స్‌ను సర్వే చేసి, లాభాపేక్ష లేకుండా సేవాభావంతో నడిపిస్తున్న స్కూల్స్‌ను ఎంపిక చేశారు.

ఈ అవార్డుకు రామకృష్ణాపురంలోని శ్రీ సత్య సాయి విద్యావిహార్‌ను ఎంపిక చేశారు. శుక్రవారం విశాఖపట్నం గీతం యూనివర్సిటీలోని మదర్ థెరిస్సా ఆడిటోరియంలో పార్లమెంట్ సభ్యులు భరత్, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా ట్రస్ట్ చైర్మన్ రామేశ్వరరావు అవార్డు అందుకొన్నారు.

ఈ సందర్భంగా వక్తుల మాట్లాడుతూ లాబాపేక్ష లేకుండా సేవాభావంతో పాఠశాల అవార్డుకు ఎంపిక కావడం సాధ్యమే, ఎందుకంటే ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా అవార్డులు ప్రకటిస్తాయని తెలిపారు. అవార్డు రావడం పట్ల సంతోషంగా ఉందని ట్రస్ట్ చైర్మన్ రామేశం తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్ పాల్గొన్నారు.




# అల్లాడపేటలో సీసీ రోడ్డు ప్రారంభం

**రూ.10 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణం**



**జలుమూరు, ఏప్రిల్ 24 (వార్త):** అల్లాడపేటలో అల్లాడపేట-రామదాసుపేట రోడ్డుకు నుంచి బీసీ కాలనీ వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి రహదారిని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఈ రహదారి వల్ల స్థానికులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పంచాయతీరాజ్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**-విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ**



**జలుమూరు, ఏప్రిల్ 24 (వార్త):** యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని టెక్కలి డివిజన్ శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ సూచించారు. శుక్రవారం జలుమూరు మండలం చల్లవానిపేట జంక్షన్‌లోని ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో శక్తి టీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీయ రక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ప్రోత్సహించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో ఆటపాటలతో విద్య అందించాలి

**- గొర్రిబంద కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీఓ**



**సారవకోట, ఏప్రిల్ 24 (వార్త):** అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని ఎంపీడీఓ మోహన్ కుమార్ సూచించారు. శుక్రవారం సారవకోట మండలం గొర్రిబంద అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, పిల్లల హాజరు, పౌష్టికాహార నిల్వలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న సేవలపై సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున చిన్నారులను అవసరమైతే మాత్రమే బయటకు తీసుకువచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

# నగిరికటకంలో సిమెంట్ రోడ్లు ప్రారంభం

**-రూ.60 లక్షల అభివృద్ధి పనులు ప్రజలకు అంకితం**

**జలుమూరు, ఏప్రిల్ 24 (వార్త):** నగిరికటకం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ?60 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు మరియు డ్రైనేజీలను నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ఈ అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడేందుకు ఈ పనులు దోహదపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పంచాయతీరాజ్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నాదెండ్ల కుటుంబానికి మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు పరామర్శ

**పలాస, ఏప్రిల్ 24 (వార్త):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల చింతిస్తూ వారి కుమారులు పెద్దలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ని హైదరాబాద్ లోని వారి నివాసానికి శుక్రవారం చేరుకొని మృతి చెందిన మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాదెండ్ల భాస్కరరావు ఇక లేరని విషయం తెలుసుకుని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని కోరుకుంటూ వారికి పలాస మాజీ మున్సిపల్ చైర్మన్, జనసేన నాయకులు కోత పూర్ణచందర్రావు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



## 90 మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు



**జి.సిగడాం, ఏప్రిల్ 24 (వార్త):** ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం క్రింద దాలెంరాజు వలస గ్రామంలో ఎంపీటీసీ కుమరాపు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో మొదటి విడత 78 మందికి రెండో విడత 16 మందికి మొత్తం 94 మంది పేదలకు మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ల కిట్‌ను పంపిణీ చేశారు.సుమారు రూ.5 వేలు విలువైన ఈ కిట్‌లో నిండు గ్యాస్ సిలిండర్, స్టవ్, రెగ్యులేటర్, గ్యాస్ పైపులను లబ్ధిదారులకు ఉచితంగా అందించారు.ఈ మాట్లాడుతూ, పేద మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అందిస్తోందని, దీనిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రవికిరణ్‌కు పంచాయతీరాజ్ దినోత్సవ అవార్డు



**సోంపేట, ఏప్రిల్ 24 (వార్త):** సోంపేట మేజర్ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ పైల రవికిరణ్‌కు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ అవార్డు లభించింది. ఇందుకు జిల్లాలో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఎంపిక కాగా అందులో రవికిరణ్ ఒకరు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవం లో రవి కిరణ్ కు సత్కరించి అవార్డు ప్రధానం చేశారు. రవి కిరణ్ కు అవార్డు పట్ల పంచాయతీ ఈవో శాంతకుమారి, ఆఫీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## పాగోడు-గొటివాడ తారు రోడ్డు ప్రారంభం

### -రూ.1.60 కోట్లతో నిర్మాణం



**జలుమూరు, ఏప్రిల్ 24 (వార్త):** పాగోడు నుంచి గొటివాడ వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+ూ) ద్వారా ?1 కోటి 60 లక్షల వ్యయంతో నిర్మించిన తారు రోడ్డును నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ఈ రహదారిని ప్రజలకు అంకితం చేశారు. ఈ రహదారి వల్ల స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం బలపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పంచాయతీరాజ్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జలుమూరులో తారు రోడ్ల ప్రారంభం

### రూ.2.92 కోట్లతో నిర్మించిన రహదారులు ప్రజలకు అంకితం

**జలుమూరు, ఏప్రిల్ 24 (వార్త):** మర్రివలస రోడ్డు నుండి ఎస్టీ మాకివలస వరకు, అలాగే కరకవలస–బైదలాపురం రోడ్డు నుంఎతీఓ ఎస్టీ మాకివలస వరకు నిర్మించిన తారు రోడ్లను నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. సుమారు ?2 కోట్ల 92 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ రహదారులను కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రజలకు అంకితం చేశారు. ఈ రహదారులు స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో కీలకంగా ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పలాస కంట్లో మట్టి

### -పట్టణ నడిబొడ్డున అక్రమ తవ్వకాలు

### -రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

### -చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

**పలాస, ఏప్రిల్ 24 (వార్త):** పలాసలో మట్టి మాఫియా రెచ్చిపోతోందని, కానీ అధికార యంత్రాంగం మౌనం దాల్చడంతో పాటు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు కొంతమేరకు ముట్టజెప్పి మట్టి మాఫియా పనులు చక్కబెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలాస మండలంలో మట్టి, కంకర అక్రమ తవ్వకాల మాఫియా రోజురోజుకు రెచ్చిపోతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. కొండలను తవ్వి టిప్పర్లతో మట్టి, గ్రావెల్ తరలిస్తూ భారీ స్థాయిలో అక్రమ దందా సాగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో జేసీబీలతో కొండలను తవ్వించి పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టిని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. పలాస మండలం కొత్తపూరు, తర్లాకోట ప్రాంతాలపై ప్రస్తుతం మట్టి, కంకర మాఫియా దృష్టిలో పడ్డాయని గ్రామస్థులు చెబుతున్నారు. రాజగోపాలపురానికి చెందిన కుమార్, మొగిలి పాడుకు చెందిన పాపారావులు మట్టి కంకర కైంకర్యానికి పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పలాస లోని మోర్ వెనుక భాగంలో సుమారు 6 ఎకరాల్లో విస్తీర్ణం కలిగిన ప్రాంతాన్ని మట్టితో కప్పి ప్లాట్ గా చేయడానికి సుమారు రూ.15 లక్షలు భేరం కుదుర్చుకున్నారని ప్రచారం జరుగుతుందని, పలాస పట్టణ నడిబొడ్డులో రాత్రి 10 గంటల నుంచే మట్టి, కంకర మాఫియా రెచ్చిపోతూ తెల్లవారు జామువరకు టిప్పర్లతో మట్టి తెచ్చి కప్పేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ తవ్వకాలతో కొండల ఆకృతి మారిపోతుండటంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్ప టికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తు తున్నారు. మట్టి, కంకర అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన పోలీసులు, మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ అండదండలతోనే ఈ మట్టి మాఫియా అక్రమ దందా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఇటీవల కాలంలో మందస మండల ప్రాంతంలో పలు చోట్ల మట్టి మాఫియా పై ఉక్కు పాదం మోపుతుంటే తెలుస్తున్నప్పటికీ, పలాసలో అక్రమ మట్టి మాఫియాపై గత కొద్దిరోజులుగా ఎన్నో కథనాలు వచ్చినప్పటికీ కనీస చర్యలు చేపట్టకపోవడంపై అనుమానాలకు దారి తీస్తుంది. ఇప్పటికైనా పలాస తహశీల్దార్ అక్రమ మట్టి మాఫియాపై ఉక్కు పాదం మోపాలని పలాసవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న జేసీబీలు, టిప్పర్లను సీజ్ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తవ్వకాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోకపోతే కొండలు పూర్తిగా కనుమరుగై ప్రకృతి వనరులు నాశనం కావడం ఖాయమని హెచ్చరిస్తున్నారు.





### ఫకీరుపేటలో మ్యాన్ హోల్ ..

## సమస్య పరిష్కరించండి

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 24(వార్త):** ఫకీరు పేట వద్ద మంచి నీటి పైప్ లైన్ మ్యాన్ హోల్ చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాయని మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ జిల్లా వైస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు ఉళాల భారతి దివ్య చెప్పారు ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రమేశ్ కి వినతిపత్రం పంపారు. కొన్ని మ్యాన్ హోల్స్ ఓపెన్ గా ఉండటం వల్ల చిన్న పిల్లలు పడిపోతున్నారని బైక్‌లు అయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రత్యేకంగా రాత్రి సమయంలో వీధిలైట్లు పని చేయకపోవడం వల్ల అక్కడ పూర్తిగా చీకటి ఉంటుందని. ఈ పరిస్థితుల్లో ప్రజలు గోతుల్లో పడిపోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందని. ఇది ప్రజల ప్రాణాలకు ప్రత్యక్ష ముప్పునిఇప్పటికైనా దయచేసి వెంటనే స్పందించి, అన్ని హోల్స్ కి సరైన కవర్ లు అమర్చడం చేయాలని కోరారు. వీధి దీపాలు మరమ్మతులు చేయించాలని, తాత్కాలికంగా బారి కేడ్ లు ఏర్పాటు చేయాలని కోరారు.



## గ్రానైట్ కార్మికుడి మృతి



**మెళియాపుట్టి, ఏప్రిల్ 24(వార్త):** గంగరాజుపురం పంచాయతీ పరిధిలో ఉన్న రాజయోగ్ గ్రానైట్ కంపెనీలో రాయి కట్టర్ గా పనిచేస్తున్న ధర్మరాం ( 34) అనే గ్రానైట్ కార్మికుడు గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై మహమ్మద్ అమీర్ అలీ తెలిపారు. పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రం నాగరు పూర్ జిల్లాకు చెందిన ధర్మరాం గత కొంతకాలంగా రాజయోగ్ గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి రాయి కటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కటింగ్ చేసే యంత్రంకి సంబంధించిన ఇనప వుచా ధర్మారం కంఠంలో స్వరపడడంతో తీవ్ర రక్తస్రావంతో టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపారు. దీని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అమీ అలీ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతునికి టెక్కలి ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం జరిగిందని తెలిపారు

## వాతావరణ మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 24 (వార్త):** ఏప్రిల్ లో మండల స్థాయిలో సిబ్బంది రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌లకు ఖరీఫ్ సీజన్ సిద్ధత ఎల్–నినో ప్రభావ నివారణపై 2 రోజుల ఫీల్డ్ ఇన్‌హౌస్ శిక్షణ (పార్ట్–బి) నిర్వహించారు. ఈ శిక్షణలో వాతావరణ మార్పులకు అనుగుణమైన సహజ వ్యవసాయ పద్ధతులు, సమయానుకూల పంట ప్రణాళిక, నేల ఆరోగ్య నిర్వహణ, కీటకాలు మరియు వ్యాధుల ముందస్తు అంచనాపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ ప్రదర్శనలు చర్చల ద్వారా సిబ్బంది సామర్థ్యాలు మెరుగుపడ్డాయని అన్నారు. రైతుల్లో అవగాహన పెంపు, స్థిరమైన పద్ధతుల అమలు కార్యక్రమాల సమర్థవంతమైన నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్, చిట్టిబాబు తదితరులుపాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

### - క్యాడర్‌కు దిశానిర్దేశం చేసిన

### ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**జలుమూరు, ఏప్రిల్ 24 (వార్త):** పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సూచించారు. శుక్రవారం జలుమూరు మండలం రామదాసుపేటలో నిర్వహించిన సమావేశంలో నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన విస్తృతంగా చర్చించారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు ప్రతి కార్యకర్త చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడం కార్యకర్తల ప్రధాన బాధ్యతగా వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడుతూ తాగునీరు, రహదారులు, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచుతూ ప్రజలకు వాటి ప్రయోజనాలను స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే క్రమశిక్షణ, సేవాభావం అవసరమని, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తేనే పార్టీ మరింత బలపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546